క్లుప్తంగా

జగనన్నకు అండగా.. కిరణన్నకు తోడుగా..



కాకుమాను: స్వార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నకు అండగా.. కిరణన్నకు తోడుగ ఉండాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు యుద్ధమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. పేదల ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిమితిలోనే మద్యం విక్రయించాలి



కాకుమాను: నిబంధనలకు అనుగుణంగా మద్యం దుకాణాల్లో పరిమితిలోనే మద్యం విక్రయించాలని పొన్నూరు సెబ్ సీఐ రామారావు తెలిపారు. మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున షాపులకు కేటాయించిన కేసుల మద్యం వరకే విక్రయించాలని సిబ్బంది చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు గురై అధిక మొత్తంలో మద్యం విక్రయంచరాదని స్పష్టం చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్వో ఎ.లక్ష్మీకుమారి చెప్పారు. చింతలపూడిలోని వీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో సోమవారం 247 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. వాటిలో పొన్నూరు 12, గుంటూరు వెస్ట్ 49, ఈస్ట్ 13, మంగళగిరి 32, తెనాలి 41, ప్రత్తిపాడు 25, తాడికొండ 19, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 56 మంది ఉన్నారని తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఓటింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీళ్లు అడిగి..వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చేబ్రోలు: మధ్యాహ్నం సమయంలో దప్పికవుతుందని, తాగునీరు కావాలని అడిగిన ఇద్దరు యువకులు.. మంచినీరు ఇచ్చిన వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తరెడ్డిపాలెంలో గాదె సీతారామమ్మ అనే వృద్ధురాలు ఉంటోంది. ఆమె కుమారుడు వ్యాపార రీత్య గుంటూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన సుమారు 25ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు యువకులు.. సీతారావమ్మను మంచినీరు కావాలని అడిగారు. ఆమె ఇంటిలోకి వెళ్లి నీరు తెచ్చి ఇచ్చింది. ఆమె వెను తిరిగిన వెంటనే మెడలో ఉన్న సుమారు రూ.1.50లక్షలు విలువ చేసే రెండు వరుసల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ ఘటనను కుమాడు గాదె వెంకట శివరామ కృష్ణారెడ్డికి తెలియజేయటంతో.. పరిసర ప్రాంతాల్లో విచారించిన అనంతరం అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకుడు నార్నె ధరణికుమార్‌కు తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో అధ్యాపకుడిని అభినందించారు. పర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ సోలార్ సిస్టమ్స్ అండర్ పార్షియల్ షేడింగ్ కండిషన్స్ అనే అంశంపై డాక్టర్ టీపీ రమేష్‌కుమార్, డాక్టర్ రామకోటేశ్వరరావుల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ కె.చంద్రశేఖర్ అభినందించారు.

'మండే' సూరీడు.. జడిసే జనులు

జనంపై భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తూ బెంబేలెత్తిస్తున్నాడు. సోమవారం కాస్తా 'మండే'గా మారిపోయింది. నలభై డిగ్రీలకు పైగా ప్రత్తిపాడులో ఉష్ణోగ్రతలు నమోదవడంతో అగ్గి సెగలు కక్కింది. దీంతో రోడ్లన్నీ ఇదిగో ఇలా నిర్మానుష్యంగా కనిపించాయి.

– ప్రత్తిపాడు



మధ్యాహ్నం 2.20 గంటలకు నిర్మానుష్యంగా ప్రత్తిపాడులోని పాతమద్రాసు రోడ్డు



నిర్మానుష్యంగా అంకమ్మగుడి సెంటరు రోడ్డు

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రాబోతున్నారు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- జగన్ వస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయి
- గుంటూరు రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- ప్రజలకోసం పనిచేసే నాయకుడు జగన్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు
- చంద్రబాబుకు పేదలంటే చులకన..
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు రావెల కిషోర్‌బాబు
- జొన్నలగడ్డ గ్రామంలో ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యాలయం ప్రారంభం



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ మంత్రి రావెల, లాలుపురం రాము, పురుషోత్తం, ఆళ్ల శ్రీనివాసరెడ్డి

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాబోతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఏఎస్ఆర్ సీడ్స్ అధినేత ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ గుంటూరు రీజినల్ కో–ఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు రావెల కిషోర్ బాబు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ జగనన్న మాత్రమే ప్రతి కుటుంబానికి పార్టీలు, కులమతాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ మరలా జగన్ ముఖ్యమంత్రి అయితేనే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు నిలిపేస్తాడని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రజల కోసం ప్రతి ఒక్కరిని ఆర్థికంగా అభివృద్ధి చేసి చూపిన నాయకుడు జగనన్న అని కొనియాడారు. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

చంద్రబాబుకు పేదలంటే చులకన..

చంద్రబాబుకు పేదలంటే చులకన అని వారి కోసం ఒక్కరూపాయి కూడా ఖర్చుచేయడని మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు అన్నారు. చంద్రబాబు హయాంలో తాను మంత్రిగా పనిచేశానని పేదల అభివృద్ధి కోసం ఎన్ని ప్రణాళికలు తీసుకెళ్లినా వాటిని బుట్టదాఖలు చేసేవాడని తెలిపారు. అదే విధంగా తమ వర్గం వ్యాపారులు, బడా భూస్వాముల కోసం ఎంత ఖర్చయినా చేసేవాడన్నారు. ప్రజలకోసం కష్టపడే నాయకుడు ఒక్కరేనని అది జగనేనని స్పష్టం చేశారు. జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలు, బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, కుమ్మర, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, మర్రెడ్డి రాజశేఖర్, వంగా సీతారామిరెడ్డి, వంగా నవీన్‌రెడ్డి, గోళ్ళ శివశంకర్, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

సీఎం జగనన్నతోనే బంగారు భవిష్యత్తు

ఎన్నికల ప్రచారంలో ఆళ్ల చరణ్‌రెడ్డి, వుయ్యూరు సతీష్‌రెడ్డి



నంబూరు ప్రచారంలో ఆళ్ల చరణ్‌రెడ్డి, వుయ్యూరు సతీష్‌రెడ్డి నాయకులు

పెదకాకాని: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, పేదల తలరాతలు మారిపోతాయని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ఆళ్ల చరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు 1వ వార్డు నుంచి సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ వుయ్యూరు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి నంబూరు జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు గుజ్జుల సుమతి, షేక్ అబ్దుల్ లతీఫ్, దాసరి నాగేశ్వరరావు అన్ని వర్గాల ప్రజలతో ప్రారంభించిన ప్రచార ర్యాలీకి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. యువత బైక్ ర్యాలీతో ముందుకు నడిపించారు. గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. వుయ్యూరు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ అన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆళ్ల చరణ్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో 25 ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో జరిగిందన్నారు. పెదకాకాని సెంటరును విశాలంగా విస్తరించి, ప్రమాదాలు జరగకుండా నివారించడంతో పాటు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. పెదకాకాని శివాలయం రోడ్డు విస్తరించి, తాగునీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారని వివరించారు. హిందూ, ముస్లిం, ఎస్సీ కాలనీలకు చెందిన శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడం, సుమారు రూ.2 కోట్లతో బాజీబాబా దర్గాకు సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మించినట్లు చెప్పారు. పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. శివారెడ్డి, కిరణ్‌రెడ్డి, శివ, గంగాధరరెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, సతీష్‌రెడ్డి, షబ్బీరా, మీరు, శామ్యూల్, రఘునందన ప్రసాద్, ప్రకాష్, విజయ్‌కుమార్, శ్రీకాంత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న లక్ష్యం



కొత్తపేటలో ప్రచారం చేస్తున్న పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలు కొత్తపేటలో ఎన్నికల ప్రచారం

చేబ్రోలు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం అందించిన మంచిని వివరించారు. అవ్వాతాతలతో కలిసి ముచ్చటించారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆ దిశగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరేలా పనిచేసినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చేందుకు సహకరించిన భార్య, హతమార్చిన ఆమె ప్రియుడు, మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం, ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్‌కుమార్(35) తన భార్య, పిల్లలతో బతుకు తెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటూ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. అతడి భార్య భారతీ లాలాపేట పూల మార్కెట్ సెంటర్‌లో సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటోంది. ఈక్రమంలో షాపు యజమాని షేక్ గౌస్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న క్రమంలో విషయం తెలిసిన ప్రేమ్‌కుమార్ తన భార్యను వారించాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తను హతమార్చేందుకు భారతీ పక్కా పథకం రచించింది. అప్పటికే పరిచయం ఉన్న గౌస్ గతనెల 28వ తేదీ రాత్రి ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని మాయమాటలు చెప్పి గౌస్‌తోపాటు తన తమ్ముడు ఖాశిం, అతని స్నేహితుడు రహమాన్ పథకం ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పరిధిలోని ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లారు. మద్యం తాగించి కర్రతో కొట్టి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్‌కుమార్ గొంతు కోసి హతమార్చారు. అనంతరం ప్రేమ్‌కుమార్ భార్య భారతీ తనకు ఏమీ తెలియనట్లు గతనెల 29వ తేదీన తన భర్త పెళ్లికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని, కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్‌బాషా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భారతీ ప్రియుడు గౌస్‌తో కలిసి భర్తను హతమార్చినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ఉల్లంఘనలు కనిపించడం లేదా?



అంబేడ్కర్ సెంటర్లో తొలగించని టీడీపీ కూటమి ఫ్లెక్సీలు

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో టీడీపీ కూటమి నేతలు ఏం చేసినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుమార్లు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని తెలుస్తోంది. ఈ నెల 5న టీడీపీ నిర్వహించిన సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొనడంతో అంబేడ్కర్ సెంటర్లో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభ ముగిసి మూడు రోజులు పూర్తయిన ఫ్లెక్సీలు తొలగించలేదు. సంబంధిత ఎన్నికల అధికారులు పటీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ నేతల ఫ్లెక్సీలు ఉండకూడదనే నియమావళిని అధికారులు ఉల్లంఘిస్తున్నారు. వెంటనే అంబేడ్కర్ సెంటర్లోని ఫ్లెక్సీలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నాట్కోలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సర్జికల్ అంకాలజీ విభాగంలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు, రెండు రోజులు ఓపీ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో పలు విభాగాధిపతులతో సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఓపీల మాదిరిగానే నాట్కో సెంటర్‌లో కూడా ఓపీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలన్నారు. మధ్యాహ్నం కూడా ఓపీ నిర్వహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రతి సోమ, గురువారం మెడికల్ ఆంకాలజీ విభాగంలో కొత్త ఓపీ రిజిస్ట్రేషన్ లు జరగాలని చెప్పారు. మంగళ, శుక్ర వారాల్లో రేడియేషన్ ఆంకాలజీలో రిజిస్ట్రేషన్లు, బుధ, శనివారం సర్జికల్ ఆంకాలజీ రిజిస్ట్రేషన్లు జరగాలని తెలిపారు. మూడు వైద్య విభాగాలు సమన్వయంతో పని చేయాలనీ, ఒకరి ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన రాకూడదన్నారు. 15 రోజులుగా సర్జికల్ విభాగంలో డీఈఓ రావడం లేదని ఆంకాలజీ వైద్యులు వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుని రాగానే వెంటనే నోటీసు ఇచ్చి వేరే ఒకరిని నియమించాలని ఆదేశించారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సోమవారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న గోపి గాయపడ్డాడు. గాయపడి క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పరామర్శించారు. పేషంట్ కు అత్యవసర చికిత్స, వార్డును కేటాయించాల్సిందిగా ఆదేశించారు.

మానవాళికి సత్యం ధర్మాన్ని బోధించాలి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు జరగనున్న 'సంక్షిప్త రామాయణం' ధారవాహిక ప్రవచనం సోమవారం రాత్రి ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ మానవ జీవితం అత్యంత ప్రవిత్రమైనదని అన్నారు. మనం కోరుకుంటే మానవ జీవితం లభించదని, దాన్ని గొప్పగా వినియోగించుకోవడంలో సార్ధకత ఉందని చెప్పారు. పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, మన్నవ ర విప్రసాద్, పి.శివారెడ్డి, సాంబశివరావు, లక్ష్మీసత్యనారాయణ పాల్గొన్నారు.

సేద్యపు నీటి కుంటలతో రైతులకు మేలు

కొత్తమల్లాయపాలెం(ప్రత్తిపాడు): సేద్యపు నీటి కుంటలతో రైతులకు మేలు చేకూరుతుందని ఈజీఎస్(ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్) జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో తీసిన సేద్యపు నీటి కుంటలను సోమవారం ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పరిశీలించారు. ఎన్ని ఎకరాలకు, ఎంత విస్తీర్ణంలో గుంత తీశారు, నీటి నిల్వ సామర్థ్యం ఎంత? వంటి విషయాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటి కుంట వద్ద చేపట్టాల్సిన మరిన్ని మార్పులను ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కుంటకు నాలుగు పక్కల కట్టలు మొత్తం సెక్షనింగ్ చేసి శుభ్రం చేయాలని ఆదేశించారు. మండలంలో ఇంకా సేద్యపు నీటి కుంటలతో పాటు పండ్ల తోటలు ఎక్కువగా గుర్తించాలని సూచించారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లు గౌరీ శంకర్, శ్రీధర్, డ్వామా మేనేజ్‌మెంట్ అండ్ ఎవల్యూషన్ అధికారి పావులూరి బాలమ్మ, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఈసి రాజా పాల్గొన్నారు.

మాదిగల మద్దతు వైఎస్సార్ సీపీకే

నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాదిగలకు అన్ని విధాలుగా మేలు జరిగిందని, మళ్లీ ముఖ్యమంత్రి అయితే మాదిగలకు మరింత లబ్ధి చేకూరుతుందని మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మాదిగలతో నగరంపాలెంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మాదిగలు ఆర్థికంగా నిలదొక్కుగలిగారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న మాదిగలంతా వైఎస్సార్ సీపీ తరఫున నిలబడిన మంత్రి విడదల రజిని అఖండ మెజార్టీతో గెలిపించి టీడీపీ కంచు కోటను బద్దలు కొట్టాలన్నారు. భవిష్యత్‌లో పశ్చిమ నియోజకవర్గం అంటే వైఎస్సార్ సీపీ గడ్డా అని చెప్పుకునే విధంగా రజినిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాసరిపల్లె విక్టర్, కొదమల వినయ్‌కుమార్, దర్శనపు ప్రసాద్, గుడ్డేటి జోషి, కోటేశ్వరరావు, దేవరకొండ శివ, బాబు, రెబ్బవరపు మనోహర్, నూతక్కి బాబు, జయరాం, నాగిపోగు రాజేష్, బుట్టి సురేష్, బాబూరావు, మోహనరావు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ఎన్నికల ప్రచారం



గొర్లవారిపాలెంలో వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ అప్పమ్మ ఎన్నికల ప్రచారం



పెదపలకలూరులో నూనె దశరథరామిరెడ్డి ఎన్నికల ప్రచారం



40వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సాంబిరెడ్డి ప్రచారం

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే బడుగు బలహీన వర్గాల ప్రజలు, అగ్రవర్ణ పేదలు సంక్షేమ పథకాలు అందుకుని, సంతోషంగా జీవిస్తారని మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొలకలూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్‌స్థాయి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా కిలారి వెంకటరోశయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థిగా బలసాని కిరణ్‌కుమార్‌ను రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే నాయకులకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. సోమవారం 26వ డివిజన్ నల్లపాడు గ్రామంలో స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కొలకలూరి కోటేశ్వరరావు, దుగ్గెంపూడి కిషోర్‌రెడ్డి, దుగ్గెంపూడి బాలఅంజిరెడ్డి తదితరులు ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా తురకపాలెం గ్రామంలో సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు పేరేచర్ల శంకర్, భాస్కరరావు ఇంటింటి ప్రచారం చేశారు. గోర్లవారిపాలెం గ్రామంలో సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ, వైస్ ఎంపీపీ దర్శి సుజాత ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. పెదపలకలూరు గ్రామంలో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. రత్నగిరినగర్ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు నూనె దశరథరామిరెడ్డి, రామకోటేశ్వరరావు, వెంకటరామయ్య తదితరులు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి ఈ నెల 13న రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.